క్లుప్తంగా

పొగాకు రహిత సమాజానికి కృషి



నవాబుపేట: పొగాకు రహిత సమాజం స్థాపించి పొగాకుతో వివిధ రకాల వ్యాధులబారిన పడ్డ విషయాలు ప్రతివ్యక్తికి తెలిసేలా అవగాహన కల్పించాలని మండల వైద్యాధికారి శ్రావణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో పొగాకు రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పొగాకు వాడకం వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శ్రీనివాస్, శరభలింగం, నిర్మల, మాధవి తదితరులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగుల దినోత్సవం



జడ్చర్ల టౌన్: మానసిక దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని సత్యేశ్వర సేవా ఆశ్రమంలో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. శిబిరంలో న్యాయమూర్తి ముదసిర్ పాల్గొని ప్రసంగించారు. మానసిక దివ్యాంగుల కోసం ఉన్న చట్టాలను తెలియజేశారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆశ్రమ నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాలిక్‌షాకీర్, న్యాయవాదులు ప్రశాంత్, శ్రీనివాస్‌గౌడ్, విశ్వేశ్వర్, పురుషోత్తం, రాములు, సాహితిరెడ్డి, కోర్టు సిబ్బంది దేవా, సంతోషి, ఆశ్రమ నిర్వాహకులు చిత్తనూరి ఈశ్వర్ పాల్గొన్నారు.

68మంది చిన్నారులకు గుండె పరీక్షలు



పాలమూరు: సత్యసాయి సుజలా స్రవంతి ట్రస్ట్ సహకారంతో జిల్లా వైద్యారోగ్యశాఖ, ఆర్‌బీఎస్‌కే సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా జనరల్ ఆస్పత్రిలో శుక్రవారం చిన్నారులకు గుండె సంబంధిత సమస్యలపై ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిని పద్మజా, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగా అజ్మీరా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక టెక్నీషియన్స్ చిన్నారులకు 2డీ ఈకో, రక్త పరీక్షలు, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 68మంది చిన్నారులకు పరీక్షలు చేయగా 16మందికి ఆపరేషన్ అవసరమవుతుందని గుర్తించారు. మరో 18కేసుల్లో కావాల్సిన మందులను అందించారు.

నేడు సన్నాహక సమావేశం

జడ్చర్ల టౌన్: బాదేపల్లి జెడ్పీహైస్కూల్ శతాబ్ది ఉత్సవ నిర్వహణలో భాగంగా శనివారం పట్టణంలోని చంద్రగార్డెన్‌లో సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు రవిశంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణ తెలియజేశారు. సమావేశానికి పూర్వ విద్యార్థులు అధికసంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఉత్సవాల నిర్వహణపై సలహాలు, సూచనలు ఇవ్వడంతోపాటు భాగస్వాములు కావాలని కోరారు.

సీజేఐపై దాడి తగదు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సీజేఐ గవాయ్‌పై ఏకంగా న్యాయవాదే దాడికి యత్నించడం తగదని ఆర్‌టీఐ పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఘటన న్యాయ, ప్రజాస్వామ్య వ్యవస్థలపై జరిగిన దాడిగా భావించాల్సి వస్తుందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. ఇప్పటికైనా బాధ్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

జెడ్పీ మాజీ కోఆప్షన్‌కు గాయాలు

భూత్పూర్: మండలంలోని అన్నాసాగర్ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అడ్డాకుల మండలం పొన్నకల్‌కు చెందిన జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు మహిమూద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్‌లో పనులు ముగించుకున్న మహిమూద్ తన బైక్‌పై పొన్నకల్‌కు వెళ్తున్నాడు. అన్నాసాగర్ దాటిన తర్వాత పెట్రోల్ బంక్‌లో భూత్పూర్ మండలం రావులపల్లికి చెందిన రామాచారి బైక్‌లో పెట్రోల్ కొట్టించుకొని రాంగ్‌రూట్లో వచ్చి మహిమూద్ బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో బైక్ పైనుంచి పడిన మహిమూద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. రామాచారికి కూడా గాయాలైనట్లు తెలిసింది. ప్రమాదంలో గాయపడిన మహిమూద్‌ను స్థానికులు అంబులెన్స్‌లో జిల్లా కేంద్రానికి తరలించి కుటుంబ సభ్యులకు ప్రమాద సమాచారం చేరవేశారు.

హక్కులపై అవగాహన ఉండాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రభుత్వ అధికారుల పనితీరులో పారదర్శకత, జవాబుదారీతనాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో రూపొందించిన సమాచార హక్కు చట్టంపై జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులందరూ సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ విజయేందిర బోయి పేర్కొన్నారు. శుక్రవార కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో ఆర్‌టీఐ చట్టం అవగాహనపై జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. అక్టోబర్ 5 నుంచి 12వరకు సమాచార హక్కు చట్టం వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పౌరులకు సాధికారత కలిగిందని, అధికారులు ఎలా పని చేస్తున్నారో తెలుసుకునే హక్కు పౌరులకు లభించిందన్నారు. సమాచార హక్కు చట్టం రావాడానికి ఎంతో పోరాటం జరిగిందన్నారు. రామన్ మెగసేసే అవార్డు గ్రహీత సామాజిక వేత్త సందీప్ పాండే, మాజీ ఐఏఎస్ అధికారిణి అరుణారాయ్ లాంటి వారు ఎందరో కృషి చేశారన్నారు. ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకతను తీసుకురావడం, ప్రభుత్వ అధికారులు తమ చర్యలకు జవాబుదారీగా ఉండేలా చూపిన ఈ చట్టంపై అధికారులకు తెలిసినప్పుడే దరఖాస్తుదారుడు కోరిన సమాచారాన్ని సరైన విధంగా నిర్ణీత గడువులో ఇవ్వగలుగుతారన్నారు. ఆర్‌టీఐకి సంబంధించిన దరఖాస్తుదారులకు నిర్ణీత వ్యవధిలో సమాచారం అందించాలన్నారు. అదేవిధంగా అప్పీల్ దరఖాస్తులకు కూడా సమాచారం అందించాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పౌర సమాచార అధికారి, సమయ పౌర సమాచార అధికారి, అప్పిలేట్ అధికారులు ఈ చట్టంలో పొందుపర్చిన ప్రతి అంశంపై అవగాహన ఉంటే ప్రతి దరఖాస్తుకి సమాధానాన్ని ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎప్పటికప్పుడు అధికారులు కిందిస్థాయి సిబ్బందికి చట్టం మీద అవగాహన కలిగించే కార్యక్రమాలను చేపట్టాలన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మధుసూదన్‌నాయక్, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి



సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు

పిల్లల పోషణపై దృష్టిసారించాలి

మహబూబ్ నగర్ రూరల్: పిల్లలు పౌష్టికాహార లోపంతో బాధపడకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పోషణమాసంపై నిర్వహించిన కార్యక్రమంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్, పోషణమాసంలో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ రకాల పోషణ్ స్టాళ్లను కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. జిల్లాస్థాయి పోషణ్‌మాసం కార్యక్రమం జిల్లాలో 17 సెప్టెంబర్ నుంచి 16 అక్టోబర్ వరకు నిర్వహించుకుంటున్నామని అందులో భాగంగా పిల్లలు, గర్భిణులు, బాలికలకు వివిధ రకాల పౌష్టికాహార కార్యక్రమాలను అమలు చేస్తున్నప్పటికీ నేటికీ కొందరు పిల్లలు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారన్నారు. నేషనల్ ఫ్యామిలీ సర్వే 2021 రిపోర్ట్ ప్రకారం బాలికల్లో మహిళల్లో రక్తహీనత పోషక విలువల స్థాయిలు తక్కువగా ఉన్నాయన్నారు. పుట్టిన పిల్లలకు తల్లి పాలు ఇవ్వాలని.. అవి వారికి ఎన్నో పోషకాలను అందిస్తుందని తెలిపారు. అంగన్‌వాడీల్లో న్యూట్రి గార్డెన్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం పోషణ మాసంపై ప్రతిజ్ఞ చేశారు. బేటీబచావో బేటీ పడావో సెల్ఫీ పాయింట్ వద్ద కలెక్టర్ ఫొటో దిగారు. హెల్త్ క్యాంపులో గర్భిణులు, కిశోర బాలికలకు రక్తపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో వెంకటరెడ్డి, డీఆర్డీఓ నర్సింహులు, హార్టికల్చర్ డీడీ వేణుగోపాల్, డీఎంహెచ్‌ఓ పద్మజ, డీపీఓ పార్థసారథి, మహిళా శిశు సంక్షేమ అధికారిని జరీనా బేగం, డీఈఓ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలి

భూత్పూర్: సమాచార హక్కు చట్టంపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని ఉమ్మడి జిల్లా సహ చట్టం అధ్యక్షుడు అబూబకార్ సిద్దిఖీ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో సహచట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అందించే సేవలు, వాటివల్ల ప్రజలకు కలిగే లాభాలతోపాటు ఏఏ శాఖలు ఏఏ పనులు చేపడతారనే అంశాలు తెలియజేడానికి సహచట్టం-2005 అందుబాటులోకి వచ్చిందని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గీత, ఆర్ఐ వెంకటేశ్, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం వజ్రాయుధం

అడ్డాకుల: సమాజంలో అవినీతిని ఎండగట్టడానికి సమాచార హక్కు చట్టం వజ్రాయుధంలా పని చేస్తుందని తహసీల్దార్ శేఖర్, డిప్యూటీ తహసీల్దార్ ఖలీద్ బిన్ అహ్మద్ అన్నారు. సమాచార హక్కు చట్టం వారోత్సవాలను పురస్కరించుకుని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఐలు సృజన్‌కుమార్, శశికిరణ్, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వైద్యవిద్యార్థినికి ఆర్థిక చేయూత

స్టేషన్ మహబూబ్‌నగర్: మెడికల్ కళాశాలలో ప్రవేశం పొంది ఫీజు చెల్లించలేని స్థితిలో ఉన్న నియోజకవర్గంలోని మాచన్‌పల్లితండాకు చెందిన విద్యార్థిని రాజేశ్వరికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అండగా నిలిచారు. రాజేశ్వరి నీట్ ఎంట్రెన్స్‌లో ర్యాంకు సాధించి మహేశ్వరం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో రెండో విడతలో ఎంబీబీఎస్‌లో సీటు పొందింది. ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో కలిసి తన ఆర్థిక పరిస్థితి వివరించింది. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే విద్యానిధి నుంచి రూ.25వేలు అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు వినోద్‌కుమార్, మోతీలాల్, హరికిషన్, రవీందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినితో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

ఎల్‌ఓసీ అందజేసిన ఎమ్మెల్యే

స్టేషన్ మహబూబ్‌నగర్: నియోజకవర్గంలోని హన్వాడ మండల కేంద్రానికి చెందిన దాసరి లక్ష్మమ్మ అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నది. ఆమెకు మెరుగైన వైద్యం కోసం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం కుటుంబ సభ్యులకు రూ.2.50లక్షల ఎల్‌ఓసీని అందజేశారు. లక్ష్మమ్మ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హన్వాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్, నాయకులు యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంఘటితంగా హక్కులను సాధించుకుందాం



తెలంగాణ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీసీ సంఘాల నాయకులు

మెట్టుగడ్డ: బీసీలు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని, 42శాతం బీసీ రిజర్వేషన్లు సాధించేందుకు బీసీలు అందరం ఏకమై ఘటితంగా పోరాడి మన హక్కులను సాధించుకుందామని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌సాగర్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు, 42శాతం రిజర్వేషన్ల బిల్లు జీవోపై హైకోర్టు స్టే విధించడాన్ని నిరసిస్తూ బీసీ సమాజ్, బీసీ మేధావుల, బీసీ కుల సంఘాలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బీసీల 42శాతం రిజర్వేషన్ల విషయంలో చిత్తశుద్ధి లేకుండా ముందుకు వెళ్లి హైకోర్టు నుంచి స్టే విధించే వరకు తీసుకొవచ్చిందన్నారు. తమిళనాడు తరహాలో రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్‌లో పెడితే తప్ప చట్టబద్ధత ఉండదని, మొదటి నుంచి చెబుతున్నా.. కాంగ్రెస్ పార్టీ బీసీల మాటలు పెడచెవిన పెట్టిందని, బీసీలను మోసం చేసేందుకే ఈ విధంగా వ్యవహరించిందన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రధాన పార్టీల అధినాయకత్వం అగ్రవర్ణాల చేతిలో ఉంది, అందుకే బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకునేందుకు చూస్తున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగానే 42శాతం రిజర్వేషన్లు అమలు చేశాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, లేనిపక్షంలో బీసీలంతా ఏకమై బీసీల సత్తా చాటుతామని తెలిపారు. కార్యక్రమంలో సాగర సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్, పద్మశాలి సంఘం నాయకులు లక్ష్మీకాంత్, విశ్రాంత డీఈఓ విజయ్‌కుమార్, రజక సంఘం అధ్యక్షుడు పురుషోత్తం, జిల్లా ప్రైవేటు స్కూల్ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్, కురుమ సంఘం అధ్యక్షుడు బుగ్గన్న, పాలమూరు యూనివర్సిటీ నామకులుతదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సీఎండీని కలిసిన ఎమ్మెల్యే



దేవరకద్ర: నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించడంతో పాటు కొత్తగా సబ్‌డివిజన్ కార్యాలయం, ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి శుక్రవారం టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీని కలిసి వినతిపత్రం అందజేశారు. జడ్చర్ల సబ్ డివిజన్ పరిధిలో ఉన్న భూత్పూర్, అడ్డాకుల, మూసాపేట్ మండలాలకు ఒక సబ్ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేయాలని, అలాగే నియోజకవర్గంలోని జానంపేట వద్ద ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. నియోజకవర్గంలోని మూడు డివిజన్స్ పరిధిలోని కొత్తకాలనీలకు ఎల్‌టీ లైన్లు, వ్యవసాయానికి సంబంధించి హెచ్‌టీ లైన్లు, నియోజకవర్గ విద్యుత్ అవసరాల కోసం కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్లు కేటాయించాలని కోరారు. ఇంకా పలు సమస్యలను సీఎండీకి తెలుపగా సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

మానసిక బలోపేతం అవసరం

పాలమూరు: ప్రస్తుత పరిస్థితుల్లో మానసిక ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ ప్రత్యేక దృష్టిపెట్టాలని ఎస్‌వీఎస్ ఎండీ కేజే రెడ్డి అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్యం దినోత్సవం సందర్భంగా ఎస్‌వీఎస్ సైకియాట్రీ విభాగం ఆధ్వర్యంలో ఎస్‌వీఎస్ మెడికల్ కళాశాలలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైకియాట్రీ విభాగం హెచ్‌ఓడీ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. మానవతా సంక్షోభాల సమయంలో మానసిక ఆరోగ్య సేవల ప్రాముఖ్యతను తెలుసుకోవాలని సూచించారు. సమాజం ఎదుర్కొనే మానసిక భారం-ఆందోళన, ఆత్మవేదన, దుఃఖం వంటి అంశాలపై వివరించారు. మానసిక ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం చాలా ఉందన్నారు. అనంతరం నర్సింగ్ విద్యార్థులు మానసిక రోగాలపై ప్రత్యేక మైమ్ ప్రదర్శన నిర్వహించారు.



ఎస్‌వీఎస్ నిర్వహిస్తున్న కార్యక్రమం

అదేవిధంగా వ్యాసరచన పోటీల్లో ఎంబీబీఎస్, బీడీఎస్, నర్సింగ్ విద్యార్థులు పాల్గొని మానసిక ఆరోగ్య సేవల ప్రాముఖ్యతపై ఆలోచనాత్మక వ్యాసాలు రాశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేపీ జోషి, సూపరింటెండెంట్ హరిప్రసాద్, రెసిడెంట్ డైరెక్టర్ రాంరెడ్డి, వెంకట్‌రాహుల్, భార్గవస్వరాజ్, వనీల్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి అనుమానాస్పద వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న ప్రత్యేక పోలీసు బలగాలు

మహమ్మదాబాద్: మహమ్మదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉమ్మడి గండేడ్ మండంలో వరుసగా దొంగతనాలు సైబర్ నేరాలు జరుతున్న నేపథ్యంలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం 5గంటల వరకు ఆయా గ్రామాల కూడళ్లలో ఇద్దరు సీఐలు, ఏడుగురు ఎస్ఐలతో ప్రత్యేక బృందాలతో అనుమానాస్పద వాహనాలను తనిఖీ చేశారు. ఇటీవల గండేడ్ మండలంలోని కొంరెడ్డిపల్లి, వెన్నాచేడ్‌లో గొర్రెలు పలు గ్రామాల్లో బైకులు చోరీకి గురయ్యాయి. ఎస్పీ జానకి ఆధ్వర్యంలో ఇలాంటి ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు. అనుమానాస్పదంగా వెళ్తున్న వాహనాల పేపర్లు ఓనర్లు, ఏప్రాంత వాసులు డ్రైవర్లు ఎవరని ప్రశ్నించి అనుమానాస్పద వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం వదిలిపెట్టినట్లు తెలిపారు. వాహన యజమానులు తమ వాహనాలను జాగ్రత్తగా ఉంచుకోవాలని సైబర్‌నేరగాళ్లు, దొంగలు తిరుగుతున్న సమయంలో అనుమానాస్పద వ్యక్తులు సంచరించిన సమయంలో పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేక పోలీసులు మహమ్మదాబాద్ సిబ్బంది ఎస్ఐ శేఖర్‌రెడ్డి ఉన్నారు.

సైబర్ నేరగాళ్ల టోకరా

మహమ్మదాబాద్/గండేడ్: సైబర్‌నేరాలు ఎక్కువగా జరుగుతున్న నేటిరోజుల్లో పోలీసులు, యువకులు, విద్యావంతులు ఎంతో అవగాహన కల్పిస్తున్నా అమాయకులు సైబర్‌నేరాలకు బలవుతూనే ఉన్నారు. గండేడ్ మండల పరిధిలోని జక్లపల్లి శ్రీజ ఉద్యోగాల గురించి ఆన్‌లైన్‌లో వెతుకుతుండగా అదే సమంయలో సైబర్‌నేరగాళ్ల నుంచి ఫోన్ వచ్చింది. మీకు ఉద్యోగం రావాలంటే మాకు కొంత డబ్బు చెల్లించాలని కోరగా.. కొంతనగదు పంపించింది. ఆమె తర్వాత ఇది సైబర్‌నేరగాళ్ల పని అని తెలుసుకొని సైబర్‌క్రైమ్ నంబర్ 1930కు కాల్ చేసింది. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసునమోదు చేసినట్లు మహమ్మదాబాద్ ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

పగిడ్యాల్‌లో..

గండేడ్ మండలంలోని పగిడ్యాల్ తువ్వగడ్డ తండాకు చెందిన శ్రీనునాయక్ ఆన్‌లైన్‌లో ఇన్వెస్ట్‌మెంట్ చేస్తే ఎక్కువ మొత్తంలో డబ్బులు వస్తాయని తెలిపారు. అతని స్నేహితుడి ద్వారా తెలుసుకొని లింక్‌ను క్లిక్ చేసి అందులో రిజిస్ట్రేషన్ చేసుకోగా.. నేరగాళ్లు ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెట్టాలని కోరారు. దీంతో మొదట్లో రూ.5వేలు పెట్టుబడి పెట్టగా వెంటనే అతనికి రూ.8వేలు నేరగాళ్లు అకౌంట్‌లో వేశారు. ఎక్కువ డబ్బులకు ఆశపడి అతని స్నేహితులతో కలిసి రూ.86వేలు పెట్టుబడి పెట్టారు. వారికి తిరిగి ఎన్ని రోజులైనా డబ్బులు రాకపోవడంతో 1930 పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయగా మహమ్మదాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మిల్లీమహాజ్ నిరసన

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉత్తరప్రదేశ్‌లో మౌలానా తౌఖీర్ రజాఖాన్ అరెస్టును ఖండిస్తూ మిల్లీమహాజ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శుక్రవారం నిరసన చేపట్టారు. స్థానిక జామీయా మజీద్ ఎదుట జుమా నమాజ్ అనంతరం ముస్లింలు నిరసన చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ.. యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం మౌలానాను అక్రమంగా అరెస్టు చేసిందని ఆరోపించారు. అలాగే రాయ్‌బరేలిలో ఐలవ్ మహమ్మద్ కోసం నిరసన చేపట్టిన ముస్లింల ఆస్తులను అప్రజాస్వామిక పద్ధతిలో కూల్చివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. నిరసనలో మిల్లీమహాజ్ కన్వీనర్ తఖీ హుస్సేన్, కోకన్వీనర్ హాఫిజ్ ఇద్రీస్, అబ్దుల్లా సున్నీ, సాధిక్ హుస్సేన్, మహ్మద్ నయీమొద్దీన్ పాల్గొన్నారు.

ఏటీఎం నుంచి డబ్బులు తీసిస్తానని నగదు చోరీ

మహమ్మదాబాద్: ఏటీఎం నుంచి డబ్బులు తీసుకునేందుకు వెళ్లిన ఓ మహిళ నుంచి ఏటీఎం మార్చి రూ.28వేలు ఆమె భర్త అకౌంట్ నుంచి ఖాజేసిన ఘటన మండలంలో చోటు చేసుకున్నది. వివరాలిలా.. మండలంలోని లింగాయపల్లితండాకు చెందిన రేణుక ఈనెల 8వ తేదీన మధ్యాహ్నం మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఏటీఎం దగ్గరకు వెళ్లి డబ్బులు డ్రా చేసేందుకు ప్రయత్నిస్తున్నది. ఇదే సమయంలో అక్కడికెళ్లిన ఓ గుర్తు తెలియని వ్యక్తి వెళ్లి మీకు డబ్బులు తీసివ్వాలా అని అడిగాడు. ఆమెకు ఏటీఎం కార్డు పెట్టించి ఆమె డబ్బులు తీసుకునే సమయంలో కోడ్‌ను గుర్తుంచుకున్నాడు. చివరి సమయంలో ఆమె ఏటీఎం తీసుకునే సమయంలో ఏటీఎంను మార్చి ఇచ్చేశాడు. మరుసటి రోజు 9వ తేదీన మహిళ భర్త అకౌంట్ నుంచి రూ.28వేల నగదు డ్రా చేశాడు. గుర్తించిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆస్పత్రి కార్మికుల మెరుపు సమ్మె

- విధుల బహిష్కరణ, ఆస్పత్రి ఎదుట బైఠాయింపు
- ఏజెన్సీ కాంట్రాక్టర్, కార్మికులతో సూపరింటెండెంట్ చర్చలు
- ఐదురోజుల్లో మూడు నెలల వేతనాలు చెల్లింపునకు అంగీకారం



ఆస్పత్రి ఎదుట బైఠాయించి ధర్నా చేస్తున్న కార్మికులు

జడ్చర్ల టౌన్: జడ్చర్ల ఏరియా ఆస్పత్రిలో పని చేస్తున్న శానిటేషన్, పేషెంట్‌కేర్, సూపర్‌వైజర్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కార్మికులు మెరుపు సమ్మెకు దిగారు. ఉదయం విధుల్లో పాల్గొన్న కార్మికులు వాటిని బహిష్కరించి ఆస్పత్రి ఎదుట బైఠాయించారు. తమ వేతనాలను చెల్లించాలని నినదించారు. దసరా పండగ సమయంలోనూ వేతనాలు ఇవ్వక ఇబ్బందులకు గురయ్యామని, దీపావళి పండగకైనా వెలుగులు చూస్తామా అంటూ కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల మెరుపు సమ్మెతో సూపరింటెండెంట్ చంద్రకళ శ్రీశాంతి ఏజెన్సీ నిర్వాహకులను చర్చలకు ఆహ్వానించారు.

ఏజెన్సీ నిర్వాహకుడు, కార్మికులతో చర్చలు

కార్మికులు మెరుపు సమ్మెకు దిగటం, మధ్యాహ్నం వరకు ధర్నా కొనసాగించడంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రకళ స్పందించారు. ఏజెన్సీ నిర్వాహకుడు శ్రీకాంత్‌రెడ్డి, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేశ్, ఆస్పత్రి యూనియన్ అధ్యక్షుడు నర్సింహులు, కార్మికులను చర్చలకు ఆహ్వానించారు. ఆమె చాంబర్‌లో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. తెలంగాణ వైద్యవిధాన పరిషత్ కమిషనర్‌తో ఫోన్‌లో చర్చించి సమస్యను వివరించారు. స్పందించిన కమిషనర్ సెప్టెంబర్ వరకు 83పడకల సామర్థ్యంతో వేతన బడ్జెట్ విడుదల చేసేందుకు ఆమోదించారు. అక్టోబర్ నుంచి మాత్రం 50పడకల సామర్థ్యంతో కూడిన వేతన బడ్జెట్ మాత్రమే విడుదల చేస్తామని సూచించారు. ఇదే విషయాన్ని సూపరింటెండెంట్ యూనియన్ నాయకులు, కార్మికులకు వివరించారు. పెండింగ్‌లో ఉన్న బడ్జెట్ మూడు నాలుగు రోజుల్లో విడుదల చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారని ఐదురోజుల్లో వేతనాలు వేయిస్తామని హామీ ఇచ్చారు. కాంట్రాక్టర్ సైతం అందుకు అంగీకరించారు. దీంతో కార్మికులు సమ్మె విరమించి విధుల్లో చేరారు. అయితే పడకల సామర్థ్యం తగ్గకుండా ఉండేలా ఉన్నతాధికారులతో మరోమారు మాట్లాడాలని సూపరింటెండెంట్‌ను కోరారు. చర్చల్లో ఆర్ఎంఓ డా.హరినాథ్, కార్యాలయ సిబ్బంది రవి, యూనియన్ నాయకులు మల్లేశ్, నవీన్, రవీందర్, ఫేర్మల్, విజయలక్ష్మి, మణెమ్మ, పద్మ, భార్గవి, నీరజ, శివలీల, నర్సమ్మ, సుక్కమ్మ, అలివేల, మంగమ్మ, అంజమ్మ పాల్గొన్నారు.



కార్మికులు, ఏజెన్సీ నిర్వాహకులతో చర్చలు జరుపుతున్న సూపరింటెండెంట్

అమలుకాని జీవోతో కాంగ్రెస్ డ్రామాలు



భూత్పూర్‌లో మాట్లాడుతున్న సత్యనారాయణ

భూత్పూర్: రాజ్యాంగ నిబద్ధతను అనుసరించకుండా వీలు కానీ జీవో 9 తెరమీదకు తీసుకొచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలు ఆడుతుందని మత్స్య సహకార సంఘం ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ ఆరోపించారు. శుక్రవారం భూత్పూర్‌లో విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్ అసెంబ్లీలో స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం బీసీలకు రిజర్వేషన్ ఎలా అమలు చేస్తారో అడిగితే సమాధానం ఇవ్వకుండా మొండిగా ప్రవర్తించారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు సకాలంలో ఎందుకు నిర్వహించలేదని, నేడు ప్రజలను గందోళ పరిస్థితికి దారి తీసిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్, సీనియర్ నాయకులు నారాయణగౌడ్, మైనార్టీ రాష్ట్ర నాయకులు మహ్మద్ సాధిక్, మాజీ కౌన్సలర్ శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, రాకేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కళాశాలలో పనులు ప్రారంభం

దేవరకద్ర: దేవరకద్ర మున్సిపాలిటీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వివిధ మరమ్మతు పనులు చేపట్టడానికి గతంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి రూ.18లక్షలు మంజూరు చేయించగా శుక్రవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఊర్మిలాదేవి, పంచాయత్‌రాజ్ ఏఈ రాఘవేందర్ ఆధ్వర్యంలో పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ వర్మ, మాజీ ఉప సర్పంచ్ బాలస్వామి, కాంగ్రెస్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, అంజన్‌కుమార్‌రెడ్డి, ఫారూఖ్‌అలీ, వేణుగోపాల్ రెడ్డి, నర్వ శ్రీనివాస్‌రెడ్డి, చెన్నయ్య, రాము, చారి, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



ముగిసిన ఎస్‌జీఎఫ్ అండర్-17 వాలీబాల్‌టోర్నీ



జడ్చర్ల టౌన్: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని బాదేపల్లి జిల్లాపరిషత్ హైస్కూల్‌లో అండర్-17 బాల బాలికల వాలీబాల్ టోర్నీ, ఎంపికలు ముగిశాయి. టోర్నీకి 16మండలాలు, రెండు అర్బన్ కేంద్రాల నుంచి 18బాలుర, 18 బాలికల జట్లు పాల్గొన్నాయి. 490కిపైగా క్రీడాకారులు పోటీలకు హాజరయ్యారు. టోర్నీని డీఈఓ ప్రవీణ్‌కుమార్ ప్రారంభించి క్రీడాకారులను అభినందించారు. జిల్లా జట్టుకు ఎంపిక కావడంతోపాటు ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికై రాష్ట్ర టోర్నీలో రాణించాలని సూచించారు. బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ ప్రథమ స్థానం సాధించగా కోయిలకొండ ద్వితీయ స్థానం సాధించారు. బాలుర విభాగంలో మహమ్మదాబాద్ మొదటి స్థానం, నవాబుపేట ద్వితీయ స్థానం సాధించి మెమెంటోలు అందుకున్నారు. మెమెంటోలను శతాబ్ది ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రవిశంకర్, ఉపాధ్యక్షుడు సత్యం, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆనంద్, కిట్టు అందజేశారు. టోర్నీ, ఎంపికకు మెమెంటోలు, మెడల్స్‌ను ఉత్సవ కమిటీ సభ్యుడు శ్యాంసుందర్ అందజేశారు. వేడుకల్లో ఎంఈఓ మంజులాదేవి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శారదభాయి, పీడీ, పీఈటీల రాష్ట్ర అధ్యక్షుడు నిరంజన్, పేటాటీఎస్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

అలరించిన జాతీయ బృంద గాన పోటీలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలో శుక్రవారం భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు జాతీయ బృందగాన పోటీలు నిర్వహించారు. 13 పాఠశాలల నుంచి దాదాపు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న బీవీపీ పాలమూరుశాఖ ప్యాట్రన్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రాంత కార్యదర్శి శివరామకృష్ణ, సలహాదారులు పాండురంగం, పాలమూరుశాఖ అధ్యక్ష, కార్యదర్శులు భూషణ్ పాండే, రమేష్ చందర్, వెంకటేశ్వర గుప్త, వీఎస్ఆర్‌కె ప్రసాద్, చంద్రుడు, రాంచందర్, బస్వరాజ్, సురేష్ చంద్ దూత్, సహదేవ్, డీకే ఆంజనేయులు, ప్రేమ్ పాల్గొన్నారు.

వీరే విజేతలు..: ఎస్‌వీకేఎం స్కూల్ (జడ్చర్ల) ప్రథమ, శ్లోక స్కూల్ (జడ్చర్ల) ద్వితీయ, యూనివర్సల్ స్కూల్ (మహబూబ్‌నగర్) తృతీయ, లిటిల్ స్కాలర్ స్కూల్ (మహబూబ్‌నగర్) నాల్గవ, ప్రాంతీయ భాష తెలుగు, జానపద గేయాల్లో ఎస్‌వీకేఎం స్కూల్ (జడ్చర్ల) ప్రథమ, శ్లోక స్కూల్ (జడ్చర్ల) ద్వితీయ, మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాల (మహబూబ్‌నగర్) తృతీయ, గెలాక్సీ స్కూల్ (మహబూబ్‌నగర్) ప్రోత్సాహక బహుమతి.